క్లుప్తంగా

నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

కాళేశ్వరం: మహదేవపూర్ సబ్‌స్టేషన్ పరిధిలోని బొమ్మాపూర్‌లో 11కేవీ విద్యుత్ లైన్ మరమ్మతులు చేస్తున్న నేపథ్యంలో నేడు(బుధవారం) విద్యుత్ సరఫరాలో అంతరాయం కలుగుతుందని ఏఈ శ్రీకాంత్ మంగళవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఉదయం 9గంటల నుంచి మధ్యాహ్నం 12గంటల వరకు అంతరాయం కలుగుతుందని వినియోగదారులు సహకరించాలని కోరారు.

రేపు ఎమ్మెల్యే పర్యటన

వాజేడు: మండలంలో రేపు(గురువారం) భద్రాచలం ఎమ్మెల్యే తెల్లం వెంకట్రావ్ పర్యటించనున్నట్లు తహసీల్దార్ శ్రీనివాస్ ఒక ప్రకటనలో పేర్కొన్నారు. తెలంగాణ ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా ప్రవేశ పెట్టిన తెల్ల రేషన్‌కార్డు దారులకు సన్న బియ్యం పంపిణీ కార్యక్రమాన్ని ఎమ్మెల్యే చేతుల మీదుగా ప్రారంభించనున్నట్లు తెలిపారు.

విరాళం అందజేత



భూపాలపల్లి రూరల్: భూపాలపల్లి మండలంలోని ఆజాంనగర్‌కు చెందిన కానిస్టేబుల్ చంద్రకాంత్ తల్లిదండ్రులు కొత్తూరి లక్ష్మీనారాయణ లక్ష్మిలు శివకేశవ జ్ఞాన సరస్వతి ఆలయానికి రూ.10,010లను విరాళంగా ఇచ్చారు. ఈ మేరకు ఆలయ కమిటీ సభ్యులకు మంగళవారం అందజేశారు.

చట్టాలపై అవగాహన ఉండాలి

శాయంపేట : మహిళలకు చట్టాలపై అవగాహన ఉండాలని సఖి లీగల్ అడ్వైజర్ శ్రీదేవి అన్నారు. మంగళవారం మండలంలోని పెద్ద కోడెపాకలో వీఓ కమ్యూనిటీ హాల్‌లో మహిళ శిశు సంక్షేమ శాఖ, సర్వోదయ యూత్ ఆర్గనైజేషన్ ఆధ్వర్యంలో మహిళలకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా సఖి లీగల్ అడ్వైజర్ శ్రీదేవి మాట్లాడుతూ.. సఖి సెంటర్ ద్వారా కౌన్సెలింగ్ సహాయం, వైద్య, పోలీస్ సహాయం, తాత్కలిక వసతి, న్యాయ సహాయం అందిస్తున్నట్లు చెప్పారు. గృహహింస, లైగింక వేధింపులు, పనిచేసే చోట వేధింపులు, అత్యాచారాల వంటి వేధింపులపై రక్షణ పొందడానికి సఖి సెంటర్ 24 గంటలు అందుబాటులో ఉంటుందని అన్నారు. బాధిత మహిళలు వినియోగించుకోవాలని సూచించారు. 181 మహిళా హెల్ప్‌లైన్ నంబర్‌కు కాల్ చేయడం ద్వారా తక్షణ సాయం, రక్షణ కల్పించనున్నట్లు చెప్పారు. అనంతరం సఖి సెంటర్ కరపత్రాలను ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో కేస్ వర్కర్ అనూష, సీసీ ప్రభాకర్, వీఓఏ విజయ, మహిళా సంఘాల సభ్యులు పాల్గొన్నారు.

కానిస్టేబుల్‌కు సన్మానం

శాయంపేట : మండల కేంద్రంలోని పోలీస్ స్టేషన్‌లో ఐదు సంవత్సరాలుగా కానిస్టేబుల్‌గా విధులు నిర్వర్తించిన కానిస్టేబుల్ రంజిత్‌కుమార్ ఇటీవల బదిలీ అయ్యారు. ఈ మేరకు మంగళవారం స్థానిక పోలీస్ స్టేషన్‌లో రంజిత్ కుమార్‌ను శాయంపేట సీఐ రంజిత్‌రావు, దామెర ఎస్సై అశోక్ శాలువాతో సత్కరించారు. ఈ కార్యక్రమంలో ఏఎస్సై కుమారస్వామి, సిబ్బంది పాల్గొన్నారు.

‘ఇప్ప’తో బహుళ ప్రయోజనాలు

- గిరిజనులకు వేసవి ఆదాయం
- ప్రజలకు ఆహారంతో పాటు ఆరోగ్యం
- పంటకు ఎరువుగానూ ఉపయోగం



ఇప్ప పూలు ఏరుతున్న గిరిజనులు

వాజేడు: అడవికి వెళ్తే మనకు ఎక్కువగా ఇప్పచెట్లు కనబడతాయి. అవి మానవాళికి బహుళ ప్రయోజనాలను సమకూరుస్తాయి. వేసవి కాలంలో ఇప్ప చెట్లు పువ్వులను పూస్తాయి. రాలిన పువ్వులను గిరిజనులు ఏరుకొస్తారు. వాటిని ఆర బెట్టి తమ అవసరాలకు ఉంచుకుని మిగతా వాటిని గిరిజన సహకార సంస్థ ద్వారా విక్రయించి ఆదాయాన్ని సమ కూర్చుకుంటారు. వేసవిలో కూలీలకు పనులు తగ్గిన సమయంలో ఆర్థికంగా ఇది ఉపయోగపడుతోంది.

ఇప్పపువ్వుతో ఆరోగ్యం

ఇప్ప పువ్వులను గిరిజనులు కేవలం సారా కోసం ఉపయోగిస్తారనే నానుడి ఉంది. అంతే కాకుండా ఇప్ప పువ్వులను ఆహారంగా కూడా తీసుకుంటారు. ఇప్ప పువ్వులను ఆర బెట్టి ఎండిన తర్వాత వేంచుకుని బెల్లంలో కలుపుకుని తింటారు. ఎండిన పువ్వులను ఉలువలు, కందులతో కలిపి ఉడికించి తింటారు. కొందరు పువ్వులు కుడుములను చేసుకుని తింటారు. ఇలా తినడం వలన ఆరోగ్య సమస్యలు తలెత్తవు. అంతే కాకుండా కీళ్ల నొప్పులు, ఒంటి నొప్పులు తగ్గడంతో పాటు ఆరోగ్యంగా ఉంటారు. ఇప్ప నూనెను వంటల్లో కూడా ఉపయోగిస్తారు.

పంటలకు ఎంతో మేలు

ఇప్పకాయలను కోసుకొచ్చిన తర్వాత కాయలను పగులకొట్టి ఆరబెట్టి గానుగ పట్టిస్తే నూనె వస్తుంది. నూనె తీయగ మిగిలిన పిప్పిని రైతులు తీసుకువెళ్లి పొలంలో చల్లుతారు. పిప్పి చేదుగా ఉండటంతో పంటకు కీడు తల పెట్టే కీటకాలను నాశనం చేస్తుంది.

దేవుడి ప్రసాదంగా..

గిరిజన సహకార సంస్థ ద్వారా కొనుగోలు చేసిన ఇప్ప పువ్వులను దేవుడికి ప్రసాదంగా వాడుతారు. తిరుపతి వేంకటేశ్వరుడి ప్రసాదంలో ఇప్ప పువ్వుకు ప్రత్యేక ప్రాధాన్యత ఉంది. ఆ దేవుడికి ఇష్టమైన పదార్థం విప్ప పువ్వు కావడంతోనే అందులో వాడుతారని స్థానికులు తెలుపుతున్నారు. గ్రామాల్లో జరిగే చిన్న చిన్న పండుగల సమయంలో ప్రత్యేకంగా ఈ పువ్వును వాడుతారు. కాయల నుంచి తీసిన నూనెను దీపారాధనకు ఉపయోగిస్తారు. దేవుడికి ప్రతీకైన నూనె కావడంతో చాలా దేవాలయాల్లో ఈ నూనెతోనే దీపారాధన చేస్తారు.

సబ్బుల తయారీకి..

ఇప్ప పువ్వును, కాయలను సబ్బుల తయారీకి ఉపయోగిస్తారు. సబ్బుల్లో విప్ప పువ్వు, కాయలను వాడటం వలన చర్మ సంబంధ వ్యాధులు రాకుండా ఆరోగ్యంగా ఉంటారని జీసీసీ అధికారి ఒకరు తెలిపారు. జీసీసీ ద్వారా కొనుగోలు చేసిన వాటిలో ఎక్కువగా సబ్బుల తయారీకి వెళ్తాయన్నారు.



ఇప్పపూలు



విరగ పూసిన ఇప్ప చెట్టు



ఎండ బెట్టిన ఇప్పపూలు

జిల్లాస్థాయి వాలీబాల్ టోర్నీ ప్రారంభం



క్రీడాకారులకు జెర్సీలు అందజేస్తున్న నాయకులు

కాళేశ్వరం: మహదేవపూర్ మండలం అంబట్‌పల్లిలో ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ మాజీ స్పీకర్ దుద్దిళ్ల శ్రీపాదరావు జ్ఞాపకార్థం జిల్లా స్థాయి వాలీబాల్ టోర్నమెంట్‌ను మాజీ సర్పంచ్, కాంగ్రెస్‌పార్టీ రాష్ట్ర యువజన నాయకుడు ఎరవెల్లి విలాస్‌రావు ఆధ్వర్యంలో ఏర్పాటు చేసి మంగళవారం ప్రారంభించారు. ఈ టోర్నీకి జిల్లా వ్యాప్తంగా 40 వరకు టీంలు వచ్చినట్లు ఆయన తెలిపారు. వాలీబాల్ జట్లుకు ఆయన జెర్సీలు అందజేసి, క్రీడాకారులకు అన్నదానం చేశారు. టోర్నీ ముగింపు కార్యక్రమానికి నేడు (బుధవారం) శ్రీపాద ట్రస్ట్ చైర్మన్ దుద్దిళ్ల శ్రీను బాబు పాల్గొని గెలుపొందిన టీంలకు బహుమతులు అందజేస్తారని పేర్కొన్నారు. ఈకార్యక్రమంలో బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు కోట రాజబాబు, మహిళ రాష్ట్ర నాయకులు అంగోతు సుగుణ, మంథని డివిజన్ యువజన కాంగ్రెస్ అధ్యక్షులు చీమల సందీప్, బడితల రాజయ్య, ఎస్సీ సెల్ మండల అధ్యక్షుడు లేతకారి రాజబాబు, బందెల సత్తమ్మ, కటకం అశోక్, ఆస్రర్, మండల మైనార్టీ ఎజాజ్ ఖాన్, వామన్ రావు, మహేష్ పాల్గొన్నారు.

విద్యార్థి సంఘం నాయకుల అరెస్ట్ సరికాదు



పోలీస్ స్టేషన్‌లో ఏఎస్‌ఎఫ్ఐ, సీపీఐ నాయకులు

ములుగు రూరల్: హైదరాబాద్ సెంట్రల్ యూనివర్సిటీకి సంబంధించిన భూములను అమ్మకాలు చేపట్టడం సరికాదని ఖండించిన ఏఎస్ఎఫ్ఐ విద్యార్థి సంఘం నాయకులను అరెస్టు చేయడం సరికాదని సీపీఐ జిల్లా కార్యదర్శి జంపాల రవీందర్ అన్నారు. మంగళవారం జిల్లా కేంద్రంలో ఏఎస్ఎఫ్ఐ నాయకుల అరెస్టు చేయగా ఆయన మాట్లాడుతూ యూనివర్సిటీకి చెందిన సుమారు 400 ఎకరాల భూమిని ప్రభుత్వం అమ్మకానికి పెట్టడం సరికాదని అన్నారు. విద్యార్థుల భవిష్యత్ దృష్ట్యా ప్రభుత్వం భూముల అమ్మకాల నిర్ణయాన్ని వెనక్కి తీసుకోవాలని అన్నారు.

సీఎం, ఎమ్మెల్యే చిత్రపటాలకు క్షీరాభిషేకం

చిట్యాల: మండలంలోని నైన్‌పాక గ్రామంలోని రేషన్ షాపుల్లో ప్రభుత్వం ఉచితంగా సన్న బియ్యం ఇస్తున్న నేపథ్యంలో మహిళ లబ్ధిదారులు సీఎం రేవంత్‌రెడ్డి, ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణరావు చిత్రపటాలకు మంగళవారం క్షీరాభిషేకం చేశారు. ఈ సందర్భంగా కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు గూట్ల తిరుపతి మాట్లాడుతూ.. రాష్ట్ర ప్రభుత్వం సన్న బియ్యం అందజేయడం అభినందనీయం అన్నారు. గ్రామ శాఖ అధ్యక్షుడు తోట్ల రాజయ్య, తానేష్, శంకర్, రాములు, రఘుపతి పాల్గొన్నారు.

తిర్మలాపూర్‌లో..

మండలంలోని తిర్మలాపూర్ గ్రామంలో సీఎం రేవంత్‌రెడ్డి, స్థానిక ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణరావుల చిత్రపటాలకు కాంగ్రెస్ నాయకులు క్షీరాభిషేకం చేశారు. దొడ్డి కిష్టయ్య, గజ్జి రవి, శివకృష్ణ, రాంబాబు, కిషన్, కిష్టయ్య పాల్గొన్నారు.

బీఆర్‌ఎస్ ఎమ్మెల్యేలు క్షమాపణ చెప్పాలి



నిరసన వ్యక్తం చేస్తున్న ట్రాన్స్‌జెండర్లు

కాటారం: అసెంబ్లీ సమావేశాల్లో మంత్రి శ్రీధర్ బాబు ట్రాన్స్‌జెండర్ల గురించి ప్రస్తావించగా బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు వెకిలి చేష్టలు చేస్తూ నవ్వుతూ తమను అవమానపర్చారని వెంటనే వారు క్షమాపణలు చెప్పాలని ట్రాన్స్‌జెండర్ సంఘం జిల్లా అధ్యక్షురాలు రూప డిమాండ్ చేశారు. బీఆర్‌ఎస్ ఎమ్మెల్యేల వైఖరిని ఖండిస్తూ మంగళవారం మండల కేంద్రంలో ట్రాన్స్‌జెండర్లు నిరసన తెలిపారు. ఈ సందర్భంగా రూప మాట్లాడుతూ.. కాంగ్రెస్ ప్రభుత్వం ట్రాన్స్‌జెండర్లకు అండగా నిలుస్తుందన్నారు. ప్రభుత్వం అధికారంలోకి వచ్చినప్పటి నుంచి అనేక ఉపాధి అవకాశాలు కల్పించిందని, ట్రాఫిక్ అసిస్టెంట్స్‌గా ఉద్యోగ అవకాశాలు కల్పించడంతో పాటు మహాలక్ష్మి పథకం వర్తింపజేసి ఉచిత బస్సు ప్రయాణం కల్పిస్తున్నారని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ట్రాన్స్‌జెండర్లు శాన్విత, ప్రూటీ, నిత్య, శానిష్ట, రస్నా, వరోధిని, తదితరులు పాల్గొన్నారు.

మహిళా ఆరోగ్య కేంద్రంలో వైద్యపరీక్షలు



పరీక్షలు నిర్వహిస్తున్న వైద్య సిబ్బంది

వెంకటాపురం(కె): మండల కేంద్రంలోని మహిళా ఆరోగ్య కేంద్రంలో మంగళవారం వైద్యాధికారి స్నేహారెడ్డి ఆధ్వర్యంలో మహిళలకు వైద్య పరీక్షలను నిర్వహించారు. ఈ సందర్భంగా 48 మందికి పరీక్షలు నిర్వహించి మందులను అందజేశారు. వారి వద్ద నుంచి రక్త నమూనాలను సేకరించి పరీక్షలకు ములుగు ఏరియా వైద్యశాలకు పంపించారు. అలాగే చిరుతపల్లి గ్రామంలో పలువురికి వైద్య పరీక్షలు నిర్వహించి మందులను అందజేశారు. వైద్యాధికారులు వినయ్, యాకలక్ష్మి ఉన్నారు.

‘కేంద్రం వాటానే ఎక్కువ’

ఏటూరునాగారం: రాష్ట్రంలో సన్నబియ్యం పంపిణీలో కేంద్ర ప్రభుత్వం నిధులే ఎక్కువగా ఉన్నాయని బీజేపీ మండల అధ్యక్షుడు వినుకోలు చక్రవర్తి మంగళవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. రాష్ట్ర ప్రభుత్వం ఇచ్చేది ఒక కిలో బియ్యం మాత్రమే అని, మిగతా ఐదు కిలోలు కేంద్రం ఇస్తోందన్నారు. కిలో బియ్యానికి కేంద్రం రూ.40 చొప్పున ఖర్చు ఖర్చు చేస్తోందని తెలిపారు. కాంగ్రెస్ ప్రభుత్వమే మొత్తం నిధులు కేటాయించినట్లు గొప్పలు చెప్పుకోవడం అవివేకంగా ఉందన్నారు.

పేదల సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయం



చిట్యాల: రేషన్ బియ్యం పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణరావు




రేగొండ: కల్యాణలక్ష్మి చెక్కులు అందజేస్తున్న ఎమ్మెల్యే గండ్ర

- ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణ రావు

చిట్యాల/మొగుళ్లపల్లి/రేగొండ/టేకుమట్ల: పేద ప్రజల సంక్షేమమే ప్రభుత్వ లక్ష్యమని ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణరావు అన్నారు. మంగళవారం చిట్యాల మండల కేంద్రంలోని వెంకట్రావుపల్లి(సీ), మొగుళ్లపల్లి మండల కేంద్రంలో, కొత్తపల్లిగోరి మండల కేంద్రంతో పాటు, రేగొండ మండలంలోని కనిపర్తి, టేకుమట్ల మండల కేంద్రంలోని చౌక ధరల దుకాణాల్లో సన్నబియ్యం పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రభుత్వం అధికారంలోకి రాగానే ఇచ్చిన ఆరు గ్యారంటీలను నెరవేరస్తూనే ప్రభుత్వ ఉద్యోగ నియామకాలు చేపట్టామని తెలిపారు. ఎన్నికల ముందు ఇచ్చిన మాట ప్రకారం ప్రతీ నిరుపేద కుటుంబానికీ సన్నబియ్యం పంపిణీ చేస్తున్నట్లు తెలిపారు. రాష్ట్ర ఆర్థిక పరిస్థితి బాగా లేనప్పటికీ ఇచ్చిన హామీలను సీఎం రేవంత్ రెడ్డి అమలు చేస్తున్నారని అన్నారు. గతంలో రేషన్ బియ్యం పంపిణీ దందా ఉండేవని ఇప్పుడు వాటిని శాశ్వతంగా నిర్మూలించామని తెలిపారు. అలాగే మొగుళ్లపల్లి మండలంలోని 63 మంది లబ్ధిదారులకు సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కులను అందజేశారు. అలాగే అనంతరం రేగొండ మండలం కనిపర్తిలో రూ.2 లక్షల వ్యయంతో ఏర్పాటు చేసిన నూతన బోరు మోటార్‌ను ప్రారంభించారు. అనంతరం కొత్తపల్లిగోరి మండల కేంద్రంలో 13 మంది లబ్ధిదారులకు కల్యాణలక్ష్మీ చెక్కులు పంపిణీ చేశారు. డీసీఎస్ఓ శ్రీనాథ్, డీఎం రాములు, ఏసీఎస్ఓ వేణుగోపాల్, తహసీల్దార్లు వీరభద్రం, నల్లబెల్లి హేమ విజయలక్ష్మి, ఇన్‌చార్జ్ ఎంపీడీఓ రాంప్రసాద్, సివిల్ సప్లై ఇన్‌స్పెక్టర్ భాస్కర్ల రాజు, భూపాలపల్లి మార్కెట్ కమిటీ చైర్మన్ గూటోజు కిష్టయ్య, మార్కెట్ డైరెక్టర్ లక్ష్మీ, జిల్లా, మండల నాయకులు నాయినేని సంపత్ రావు, సూదన బోయిన ఓంప్రకాశ్, తిరుపతి, ముకిరాల మధువంశీకృష్ణ, చిలుకల రాయకొమురు, బుర్ర లక్ష్మన్, శ్రీనివాస్, అనిల్, గంగాధరి రవీందర్, గడ్డం కొమురయ్య, దొడ్డి కిష్టయ్య, కోటగిరి సతీష్, పులి తిరుపతిరెడ్డి, సర్వ శరత్ పాల్గొన్నారు.

చికిత్స పొందుతున్న మహిళ మృతి



ముత్తమ్మ (ఫైల్)

వెంకటాపురం(కె): మండల పరిధిలోని చిరుతపల్లి గ్రామానికి చెందిన మహిళ రోడ్డు ప్రమాదంలో గాయాలై చికిత్స పొందుతూ మృతి చెందింది. పోలీసుల కథనం ప్రకారం వివరాలు ఇలా ఉన్నాయి. చిరుతపల్లి గ్రామానికి చెందిన అట్టం ముత్తమ్మ(51) సోమవారం సాయంత్రం చిరుతపల్లి గ్రామం నుంచి బర్లగూడెం గ్రామంలోని తన కూతురు ఇంటికి వెళ్తుంది. కాగా మార్గమధ్యలో తాటి మధు అనే వ్యక్తి ద్విచక్రవాహనం బర్లగూడెం వెళ్తుండగా లిఫ్టు అడిగి వాహనం ఎక్కింది. కాగా చిరుతపల్లి ఆర్అండ్‌బీ ప్రధాన రహదారిపైకి రాగానే భుజంపై ఉన్న టవల్ పడిపోయిందని వాహనం ఆపాలని చెప్పి ఆపేలోపే దూకింది. దీంతో మహిళ తలకు తీవ్ర గాయాలయ్యాయి. గాయాలైన ముత్తమ్మను వెంకటాపురం ప్రభుత్వ వైద్యశాలకు తరలించి చికిత్స నిర్వహించి పరిస్థితి విషమంగా ఉండటంతో వరంగల్ ఎంజీఎంకు తరలించారు. ఎంజీఎంలో చికిత్స పొందుతూ మంగళవారం మృతి చెందిందని తెలిపారు. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు ఎస్సై కొప్పుల తిరుపతి రావు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

దళితబంధు నిధులు విడుదల చేయాలి



మాట్లాడుతున్న దళితబంధు సాధన సమితి నాయకులు

కాటారం: గత ప్రభుత్వం మంజూరు చేసిన దళితబంధు నిధుల విడుదల చేయాలని దళితబంధు సాధన సమితి నాయకుడు నమూడ్ల సంపత్‌మహరాజ్ తెలిపారు. మండల కేంద్రంలో మంగళవారం సాధన సమితి సభ్యులు, లబ్ధిదారులు సమావేశమయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. దళితబంధు లబ్ధిదారులకు నిధులు మంజూరు చేయకుండా ప్రభుత్వం నిర్లక్ష్యం చేస్తుందన్నారు. నిధుల విడుదల కోసం కాటారం సబ్ డివిజన్ పరిధిలోని దళితబంధు లబ్ధిదారులతో ఈ నెల 12న మండల కేంద్రంలో మహాధర్నా చేపట్టనున్నట్లు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో సాధన సమితి సభ్యులు, లబ్ధిదారులు వేమునూరి జక్కయ్య, బొబ్బిలి వెంకన్న, భూతం మధూకర్, చకినారపు చందు, పంతకాని లస్మన్న, పాగె సంతోష్, నీలాల రాజు, నగేశ్, ప్రవీణ్, సతీశ్, ప్రభాకర్, సత్యం, స్వర్ణలత, బొందమ్మ, రామన్న, తదితరులు పాల్గొన్నారు.

పశువులను వదలొద్దు

వాజేడు: పశువులను రైతులు కొద్ది రోజుల పాటు వదలొద్దని గ్రామ పంచాయతీల ద్వారా మంగళవారం ప్రచారం చేశారు. వ్యవసాయ పంటలు ఇంకా పూర్తి కాక పోవడంతో మరో 20 రోజుల పాటు కాపర్ల ద్వారా పశువులను కాసుకోవాలని కోరారు. ఉగాది పండుగ ముగియగానే పశువులను వదిలేయడం జరుగుతుంది. పంటలు పూర్తి స్థాయిలో చేతికి వచ్చే దాక పశువులను వదలకుండా చూడాలని రైతులు గ్రామ పంచాయతీ సిబ్బందికి తెలుపడంతో వారు మైక్ ద్వారా ప్రచారం చేశారు.

ప్రజలు అప్రమత్తంగా ఉండాలి



ఓఆర్‌ఎస్ ప్యాకెట్లను పంపిణీ చేస్తున్న సిబ్బంది

వాజేడు: వడదెబ్బ తగలకుండా ప్రజలు అప్రమత్తంగా ఉండాలని వైద్య, ఆరోగ్య శాఖ అధికారులు తెలిపారు. మండల పరిధిలోని అరుగుంటపల్లిలో కూలీలకు మంగళవారం ఓఆర్‌ఎస్ ప్యాకెట్లను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎండాకాలంలో తీసుకోవాల్సిన జాగ్రత్తలపై వివరించారు. అనంతరం అంగన్‌వాడీ కేంద్రాలకు వెళ్లి పిల్లల బరువు చూడడంతో పాటు వారికి అందించాల్సిన పోషకాహారం గురించి తెలిపారు. ఈ కార్యక్రమంలో హెల్త్ సూపర్ వైజర్ కోటిరెడ్డి, లలిత, కన్నమ్మ తదితరులు ఉన్నారు.

మొక్కల రక్షణకు చర్యలు



తాడిచర్ల నర్సరీలో మొక్కలు



మల్లారం నర్సరీలో వేసిన షేడ్ నెట్

నర్సరీల్లో షేడ్ నెట్ వేసిన సిబ్బంది

- ప్రతీరోజు అధికారుల పర్యవేక్షణ
- 1.80 లక్షలకు పైగా మొక్కల పెంపకానికి ఏర్పాట్లు

మల్హర్: వనమహోత్సవం కోసం ప్రభుత్వం ప్రతీ పంచాయతీకి నర్సరీని ఏర్పాటు చేసింది. రోజు రోజుకు ఎండా పెరుగుతుండడంతో నర్సరీల్లో మొక్కల సంరక్షణకు అధికారులు చర్యలు తీసుకుంటున్నారు. మొక్కలు ఎండిపోకుండా ఉండేందుకు నీళ్లు పోయడంతో పాటు షేడ్ నెట్‌తో పందిళ్లు ఏర్పాటు చేస్తున్నారు. పర్యవేక్షణ బాధ్యతలను పంచాయతీలకే అప్పగించారు. రోజూ మొక్కలకు నీరు అందించాలని, చనిపోకుండా చర్యలు చేపట్టాలని సిబ్బందిని అధికారులు ఆదేశించారు.రహదారుల పక్కన, చెరువు కట్టలు, ప్రభుత్వ కార్యాలయాల్లో నాటేందుకు మొక్కలు పెంచుతున్నారు.

ఒక్కో పంచాయతీలో 12వేల మొక్కలు

2025–26 ఆర్థిక సంవత్సరానికి గాను మండల పరిధిలోని 15 పంచాయతీల్లో ప్రభుత్వ లక్ష్యం మేరకు మొక్కలను పెంచుతున్నారు. జూన్ మాసం నాటికి 1.80 లక్షల మొక్కలను సిద్ధంగా ఉంచాలని అధికారులు భావిస్తున్నారు. తాడిచర, ఎడ్లపల్లి, వ ల్లెకుంట, నర్సరీల్లో 13వేల మొక్కులు పెంచారు. అలాగే మల్లారం, పెద్దతూండ్ల, చిన్నతూండ్ల, అడ్వాలపల్లి, దుబ్బపేట, కొయ్యూరు, కొండపేట, ఇప్పలపల్లి, రుద్రారం, అన్సాన్‌పల్లి, నాచారం, మల్లెంపల్లి నర్సరీల్లో 12 వేలకు తగ్గకుండా మొక్కలను పెంచి జూన్‌లో వనమహోత్సవం కార్యక్రమంలో నాటేందుకు సిద్ధం చేస్తున్నారు. ఈసారి జామ, నిమ్మ, దానిమ్మ, ఉసిరి, గులాబి, మందార, మునగా, కానుగా, గన్నేర తదితర మొక్కలు పెంచుతున్నారు. కార్యదర్శులు, ఈజీఎస్ సిబ్బంది మొక్కలను వేసవిలో ఎండిపోకుండా ఉదయం, సా యంత్రం వేళల్లో కూలీలతో నీటిని పోయిస్తూ సంరక్షిస్తున్నారు.

చర్యలు తీసుకుంటున్నాం..



నర్సరీల్లో అన్ని రకాల మొక్కలు పెంచేందుకు చర్యలు తీసుకున్నాం. మొక్కలు వాడిపోకుండా షెడ్ నెట్‌తో పందిళ్లు ఏర్పాటు చేశాం. కూలీలతో కలుపు మొక్కలు తీయిస్తున్నాం. నీటి తడులు అందిస్తున్నాం. గతేడాది మిగిలిన మొక్కలు సిద్ధంగా ఉన్నాయి.

– గిరి హరీశ్, ఏపీఓ, మల్హర్

ప్రణాళిక సిద్ధం చేశాం..



మండలంలో వనమహోత్సవం కార్యక్రమాన్ని సమర్థంగా నిర్వహిస్తాం. అన్ని నర్సరీల్లో మొక్కలు నాటి నీరందించేలా చర్యలు తీసుకున్నాం. మొత్తం మొక్కలు నాటేందుకు ప్రణాళికలు సిద్ధం చేశాం.

– శ్యామ్‌సుందర్, ఎంపీడీఓ, మల్హర్